క్లుప్తంగా

నర్సింహులుకే మా మద్దతు

కాంగ్రెస్ యువజన సంఘం సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్

యాలాల: కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న బంట్వారం మండలానికి చెందిన సుర్నంపల్లి నర్సింహులుకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులతో పాటు ఇతర ఎన్నికల్లో నర్సింహులు చేసిన కృషి అభినందనీయమన్నారు. పార్టీ కోసం అహర్నిషలు కష్టపడిన నర్సింహులుకే ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. పోటీలో మరో ఇద్దరు ఉన్నప్పటికీ తాము నర్సింహులుకే మదతిస్తామని ఆయన తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ప్రధాన అనుచరుల్లో ఒకరుగా ఉన్న నర్సింహుల పట్ల అధిష్టానం కూడా అనుకూలంగా ఉందని ఆయన చెప్పారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు స్వీకరిస్తున్న శ్రీనివాస్

దుద్యాల్: రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. సెలవు రోజు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ విధులకు హాజరై అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు గడువు సోమవారంతో ముగుస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆదివారం విధులకు హాజరై దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన చెప్పారు.

రాజ్‌పుత్ సమాజం అధ్యక్షుడిగా దిలీప్ సింగ్



తాండూరు టౌన్: రాజ్‌పుత్ సమాజం తాండూరు అధ్యక్షుడిగా హైకోర్టు అడ్వకేట్ దిలీప్ సింగ్ ఠాకూర్ ఏకగ్రీవంగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సమాజం గౌరవాధ్యక్షుడు ఠాకూర్ సుభాష్ సింగ్, మాజీ అధ్యక్షుడు జగన్ సింగ్, మహేష్ సింగ్ ఠాకూర్‌ల ఆధ్వర్యంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సమాజం ఉపాధ్యక్షుడిగా గంజిపల్లి ఉమేశ్ సింగ్, వెంకట్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా శివానంద్ సింగ్, కార్యదర్శిగా బాలాజీ సింగ్, కోశాధికారిగా ప్రతాప్ సింగ్‌లను నియమించారు. కార్యవర్గ సభ్యుడిగా నర్సింగ్, అమర్ సింగ్, దీపక్ సింగ్, రమేష్ సింగ్, రాజుబాయ్‌లను ఎన్నుకున్నారు.

వరంగల్ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధారూరు: వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించనున్న రజోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని పిలుపునిస్తూ ఆదివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ధారూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి ఈ నెల 27తో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. ధారూరు మండలం నుంచి వరంగల్‌కు నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మౌనేశ్వర స్వామి వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

దుద్యాల్: మండల కేంద్ర సమీపంలోని మౌనేశ్వర స్వామి వార్షికోత్సవం ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు స్వామి వారికి ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మోనయ్య చారి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామస్తులు, పాలకుల సహకారం ఉంటే రాబోయే కాలంలో మరింత గొప్పగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రయాణప్రాంగణం.. నిరుపయోగం

- పట్టించుకోని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



శిథిలావస్థకు చేరిన మర్పల్లి బస్టాండ్

మర్పల్లి: మండల కేంద్రంలో గత ప్రభుత్వం నిర్మించిన మర్పల్లి బస్టాండ్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. 1983లో అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి బస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిధులు సమకూర్చారు. భవన నిర్మాణం పూర్తయిన తరువాత 1985లో అప్పటి రవాణా శాఖ మంత్రి కుందూరి జనార్దన్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి బస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ప్రారంభంలో అన్నివసతులతో బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. ప్రతీరోజు బస్టాండ్‌లోకి బస్సుల వివరాలను రాసుకునేందుకు కంట్రోలర్‌ను కూడా నియమించారు. కాలక్రమేణ ఇక్కడ నెలకొన్న సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. తదనంతరం బస్టాండ్‌లో లైట్లు, విద్యుత్ మీటర్ కాలిపోవడం, కుర్చీలు, బెంచీలు పాడవ్వడంతో సమస్యలు రెట్టింపయ్యాయి. దీంతో అది శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ప్లాట్ ఫారంవద్ద తీసుకురాక పోవడంతో రాత్రి సమయంలో బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబుల ఆగడాలకు హద్దు లేకుండా తయారైంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతి నిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు..

బస్టాండ్ ముందు ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రక్కల చిరువ్యాపారులు డబ్బాలు వేసుకొని వ్యాపారాలు చేసుకునే వారు. ఐతే ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ఆవరణ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని సర్వే చేయించి 45 మంది చిరు వ్యాపారుల డబ్బాలను తొలిగించారు. దీంతో వారు ఉపాధి కోల్పోయారు. బస్టాండ్‌లో మరమ్మతుల అనంతరం కొత్తవి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

దుకాణాలు నిర్మించి ఇవ్వాలి

గతంలో బస్టాండ్ వద్ద దుకాణాలు పోగొట్టుకున్న చిరు వ్యాపారులకు ఆర్టీసీ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి. లేదంటే 45 మంది చిరు వ్యాపారులందరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతాం. తమకు న్యాయం జరిగేవిధంగా స్థానిక నాయకులు సహకరించాలి.

– రాచన్న, హోటల్ నిర్వాహకుడు, మర్పల్లి

సమస్యలు పరిష్కరించాలి

మర్పల్లి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు గుర్తించి పరిష్కరించాలి. కనీస సౌకర్యాలు లేక పోవడంతో రోడ్లపైనే బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మర్పల్లి బస్టాండ్‌లో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తోంది. రాత్రి సమయంలో బస్టాండ్‌లో లైట్లు సైతం వెలగడం లేదు. కనీసం తాగునీటి సౌకర్యం లేక బస్టాండ్ సమీపంలోని హోటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ భవనంలో ప్రయాణికుల అవసరం మేరక నీసవసతులు కల్పించాలి.

– సీహెచ్ మధుకర్, ఆర్టీసీ ప్రయాణికుడు, బూచన్‌పల్లి

విద్యుత్ సౌకర్యం కల్పించండి

బస్టాండ్ భవన గోడలు శిథిలావస్థకు గురయ్యాయి. గోడలను తొలగించి కొత్తగా గోడలు నిర్మించాలి. ముఖ్యంగా బస్టాండ్ ఆవరణలోపాడైన సెప్టిక్ ట్యాంకును మరమ్మతులు చేయించాలి. ప్రయాణికు ల అవసరాలమేరకు నూతన మరుగుదొడ్లు, మూ త్రశాలలు నిర్మించి నీటి వసతి కల్పించాలి. బస్సుల వివరాలను రాసుకునేందుకు కంట్రోలర్‌ను నియమించాలి. మరమ్మతుల అనంతరం బస్టాండ్ రక్షణకు వాచ్‌మెన్‌ను నియమించాలి.

– వెంకటేశం, కూరగాయల వ్యాపారి, కొత్లాపూర్

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి



దామస్తాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న రామేశ్వర్ రెడ్డి

మర్పల్లి: కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దామస్తాపూర్‌లో ఘర్ చలో గావ్ చలో అభియాన్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలన్నారు. నేటికి రుణమాఫీ మాఫీ కాలేదన్నారు. రైతు భరోస డబ్బులు 4 ఎకరాల వరకు మాత్రమే వేశారని ఆయన కాంగ్రెస్‌పై మండి పడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశాడు. కేంద్ర ప్రభుత్వం పేదల ఆకలి బాధ తీర్చేందకు ఆహార భద్రతా కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి 5 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గర్తు చేశారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే పట్టం కడుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బలరాంగౌడ్ నాగేష్, శాంతకుమార్, శ్రీమంత్‌కుమార్, మహేందర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డి



నూతన కార్యవర్గంతో సంఘం నాయకులు

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం నూతన అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డిని ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మీర్ యూసూఫ్అలీ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జయరాంరెడ్డి, లక్ష్మీనారాయణ, జలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌గౌడ్, కోశాధికారిగా కృష్ణలతో పాటు పలువురిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలు రకాల సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. విద్యా అభివృద్ధికి సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. సంఘంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే సంఘం దృష్టికి తీసుకువస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

యాలాల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూలమాల వేసి, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, నాగయ్య, మల్లేశం, గౌరిశంకర్, పూర్వ విద్యార్థులు అక్బర్‌బాబా, ప్రశాంత్‌కుమార్, రఫీక్, వడ్ల శ్రీనివాస్, రవి, రాఘవేందర్, చంద్రశేఖర్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన మున్నూరుకాపు నేతలు



మున్నూరుకాపు సన్నాహక సమావేశానికి హాజరైన సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: హైదరాబాద్ జల విహార్‌లో మున్నూరుకాపు సన్నాహక సమావేశానికి ఆదివారం నియోజకవర్గం నుంచి సంఘం నాయకులు తరలివెళ్లారు. త్వరలో నిర్వహించనున్న మున్నూరుకాపు సింహగర్జనకు సంఘం నాయకులు కార్యాచరణ రూపొందించేందుకు సంఘం నాయకులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు క్షేత్రస్థాయిలో సింహగర్జన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సంఘటితంగా కృషిచేయాలని సూచించారు.

ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రతీ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీ వసతిగృహం ఎదుట సీసీ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకుసాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, నరేంద్రప్రసాద్, నర్సింలు, పాండు, గణేష్, రాజు, మల్లేశ్, రామాంజనేయులు, వెంకటయ్య, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న శ్రీనివాస్



అనంతగిరి: మాట్లాడుతున్న యువజన సంఘం నేతలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ బి విజయకుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అన్ని కుల సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

భారీగా తరలిరావాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అంబేడ్కర్ వాదులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.సోమశేఖర్, దాము, లక్ష్మప్ప, రాములు, దస్తప్ప, అశోక్, లాలూప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ

యాలాల: మండలంలోని దేవనూరు గ్రామంలో సోమవారం బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామంలోని బస్టాండ్ కూడలిలో విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. గ్రామస్తులు, యువకులు, నాయకులు తరలిరావాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళి

అనంతగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం పులుసుమామిడికి చెందిన పలువురు యువనాయకులు వికారాబాద్ పట్టణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు పెద్దింటి శ్రీకాంత్, పాతూర్ సురేందర్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

బొంరాస్‌పేట: మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించుకునేందుకు స్థానిక అంబేడ్కర్ సంఘం నాయకులు ఏర్పాట్లను చేసుకున్నారు. ఆదివారం నాందార్‌పూర్, రేగడిమైలారం, కొత్తూరు తదితర గ్రామాల్లో ఫ్లెక్సీ, నీలి తోరణాలు, రంగులతో ముస్తాబు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. నాందార్‌పూర్‌లో చిన్నారులు, బాలికలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య శిక్షణ ఇచ్చారు. రేగడిమైలారంలో అన్నదానం, పలు గ్రామాల్లో ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామ సంఘాల నాయకులు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

బొంరాస్‌పేట: స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువును పొడిగించాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిశెట్టి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14వరకు గడువు ఉండగా దరఖాస్తులకు మీసేవా కేంద్రాల్లో సర్వర్ మొరయించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. మరో వారం రోజులు గడువు పెంచాలని కోరారు.

శోభాయమానంగా కాళికామాత రథోత్సవం



కుల్కచర్ల: కాళికామాత ఉత్సవాలలో భాగంగా కాళికామాత రథోత్సవం వేడుక కనుల పండువగా కొనసాగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేపూజలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం, పల్లకీసేవ నిర్వహించారు. మూడురోజుల పాటు కొనసాగిన ఉత్సవాలలో భాగంగా ఆదివారం చివరిరోజు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



తాండూరు రూరల్: ఖాంజాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న నాగప్ప తదితరులు



యాలాల: జుంటుపల్లిలో కాంగ్రెస్ నాయకుల పర్యటన

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప

తాండూరు రూరల్: రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం మార్చాలని చూస్తుందని, దాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ తాండూరు మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బిజ్వార్, ఖాంజాపూర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో గ్రామస్తులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ..బీజేపీ దేశంలో అప్రజాస్వామిక నియంతృత్వ పాలన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

యాలాల: రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయమని మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బండమీదిపల్లి, పగిడిపల్లి, రేళ్లగడ్డతండా, పటేల్‌చింతతండా, జుంటుపల్లి గ్రామాల్లో జైభీమ్..జై బాపు..జై సంవిధాన్ కార్యక్రమాల్లో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్ర మంత్రి మాట్లాడటం బాధాకరమన్నారు. రాజ్యాంగం పట్ల అపహాస్యం చేసిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇటీవల కాంగ్రెస్ సర్కార్ సన్నబియ్యం పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. సన్నబియ్యంతో వండిన భోజనాన్ని పటేల్ చింత తండాలో గిరిజనులతో కలిసి వారు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాజు, కాంగ్రెస్ నాయకులు హన్మంతు, శ్రీధర్, విజయ్‌కుమార్, మల్లప్ప, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను భావితరాలకు అందిద్దాం

తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ శివకుమార్

షాద్‌నగర్: ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఎంతైనా ఉందని తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రతి పౌర్ణమి రోజున తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ, భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయశాఖ సంయుక్త సౌజన్యంతో రంగక్షేత్ర, రంగస్థల కళల విద్యాలయం, నటమండలి హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో «రంగస్థల ప్రకాశనమ్» కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం రాత్రి రంగక్షేత్ర కళాకారులతో శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం, సీతాకల్యాణం పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివకుమార్ హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచం టెక్నాలజీ పేరుతో మన సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతుందన్నారు. వినోదం, విజ్ఞానం టీవీ, సెల్‌ఫోన్‌లో ఉండదని, పూర్వ కాలపు కళలు, నాటకాలలో మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడి ఉంటాయని, బంధాలు, కుటుంబ విలువలు, మన నాగరికతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. అలాంటి ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు, కళాకారుడు టీవీ.రంగయ్య మాట్లాడుతూ.. మానవ జీవన వికాసానికి, నైతికతకు, ఆధ్యాత్మికతకు ప్రాచీన కళలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతీ పౌర్ణమికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, నా వంతు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం కళాకారులను రంగస్థల నటులను అభినందించారు. కళాకారులు శివప్రసాద్‌జీ, ప్రభాకర్‌చారి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.